కథ

పెన్మెత్స శ్రీకాంత్‌రాజు

# స్పందించే హృదయం

''సార్... ఆటో...'' భుజం మీదున్న ఖాకీ చొక్కాని సర్దుకుంటూ అడిగేడు నారాయణ.

తల అడ్డంగా ఊపేడు బస్టాప్‌లో నిలుచున్నతను.

''మీటరు ఎంతైతే అంతే ఇవ్వండి'' మళ్లీ అడిగాడు ఆశగా.

ముఖం చిట్లించుకుని తల అడ్డంగా ఊపేడు అతను చిరాకు పడుతున్నట్టు. నిరాశగా వెళ్లి ఆటోకు జారబడ్డాడు నారాయణ!

నారాయణకు ముప్పై ఐదేళ్లుంటాయి. ఎక్కడో ఉత్తరాంధ్రలో పుట్టి పెరిగిన అతను చేయడానికి పని దొరక్క కొంచెం చదువుకున్నవాడవ్వటం వలన కూలిపని లాంటివి చేయలేక రెండేళ్ల క్రితం బ్రతుకు తెరువు వెతుక్కుంటూ హైదరాబాద్ వచ్చాడు. చిన్నా చితకా ఉద్యోగాలు చేశాడు. ఎందులోనూ ఇమడలేకపోయాడు. చివరికి అందరూ ఇచ్చిన సలహాతో భార్య వంటిమీదున్న కొద్దిపాటి బంగారం అమ్మి, కొంత ఫైనాన్స్ తీసుకుని సెకండ్ హ్యాండు ఆటో కొన్నాడు. ప్రతీ రంగంలోలానే ఇక్కడా కాంపిటీషన్ ఎదురైంది అతనికి. పరిస్థితులకు తలొగ్గి అరాకొరా సంపాదనతో రోజులీడుస్తున్నాడు.

అప్పటికి రెండ్రోజులుగా బేరాల్లేవు. నారాయణ జేబులో పది రూపాయల చిల్లర మాత్రమే ఉంది. ఒక్కో రోజు ఒక్క బేరం కూడా రాకపోవడం అతనికి కొత్తేం కాదు. కానీ అతనికిప్పుడు అర్జెంటుగా మూడొందలు కావాలి. ఎందుకంటే అతని ఒక్కగానొక్క కొడుకు, పదకొండేళ్ల కిరణ్‌కు వారం రోజుల నుండీ జ్వరం. రెండ్రోజుల క్రితం హాస్పిటల్‌కు తీసుకెళ్లినప్పుడు డ్యాక్టర్ నాలుగు రకాల టెస్టులు చేయించమని రాశాడు. అందుకు మూడొందలు ఖర్చవుతుంది.

కానీ శాపం తగిలినట్టు ఒక్క గిరాకీ కూడా రాలేదు!

ఖాళీ జేబుతో ఇంటికెళ్లాడు. భార్య ముఖం వైపు తలెత్తి చూడలేకపోయాడు.


''ఎలా ఉంది వాడికి?'' నేల చూపులు చూస్తూ అడిగేడు భార్యని.

''అలాగే ఉంది'' నిర్లిప్తంగా అంది అతని భార్య లక్ష్మి. అతని నేల చూపులు చూస్తుంటే ఆమెకి అర్థం అయింది ఆ రోజు అతనేమీ సంపాదించలేకపోయాడని.

మూసిన కన్ను తెరవకుండా పడి ఉన్నాడు కిరణ్. వాడి ఒళ్లు పొయ్యిమీది పెనంలా కాలిపోతోంది. చప్పున కళ్లల్లోకి నీళ్లొచ్చేయి నారాయణకి. ఒక్కగానొక్క కొడుక్కి జ్వరమొస్తే మందిప్పించలేని తన అశక్తతకి తన మీద తనకే అసహ్యం వేసింది.

''అన్నం తిందురు...'' లక్ష్మి అడిగింది.

''వద్దు... ఆకలి లేదు'' కొడుకు చుట్టూ చేతులేసి వాడి పక్కనే పడుకున్నాడు నారాయణ.



''తిండి తినకపోతే రేపు ఆటో ఎలా నడుపుతారు... లేవండి'' బ్రతిమాలింది.

నిజమేననిపించి లేచి కాళ్లు చేతులు కడుక్కొచ్చి కూర్చున్నాడు.

కంచంలో అన్నం పెట్టి, చింతకాయ పచ్చడి వేసింది లక్ష్మి. మంచం మీదున్న కొడుకుని చూస్తూంటే నారాయణకి ముద్ద గొంతు దిగటం లేదు. ఎలాగో తిన్నాననిపించి మంచం చేరేడు.

''చీకటి తోటే లేపు'' భార్యతో చెప్పి కొడుకు జుట్టు నిమురుతూ కలత నిద్రపోయాడు.

తెల్లవారుఝామునే లేచి కాలకృత్యాలు, స్నానాదికాలు ముగించి, దేవుడికి దణ్ణం పెట్టుకుని ''ఎలా అయినా డబ్బుతో వచ్చి, పిల్లాడికి ట్రీట్‌మెంట్ చేయించాలి'' గట్టిగా అనుకుని ఆటోని ముందుకురికించాడు నారాయణ.

అలా ఇంట్లో నుండి బయలుదేరిన నారాయణ...ఉదయం నుండి ఇప్పటివరకు బేరాల కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాడు. అతని ముందున్న ఆటోలకు బేరాలు వస్తున్నాయి. వెనుక ఉన్న వాటికి వస్తున్నాయి అతనికి తప్ప!

మధ్యాహ్నం దాటిపోతోంది. ఉదయం టీ బడ్డీ దగ్గర తాగిన టీ తప్ప అతని కడుపులో ఏమీ లేదు. 'ఇంట్లో బిడ్డ ఎట్లున్నాడో?...' దిగులుగా అనుకున్నాడు నారాయణ. ఎక్కడా అప్పు కూడా పుట్టలేదు.

'దేవుడు పరీక్ష చేస్తున్నట్టున్నాడు. ఒక్క సవారీ కూడా దొరక్కపోవడం, అప్పు కూడా దొరక్కపోవడం ఏంటో మాయలా ఉంది' అతన్ని నిరాశతో పాటు కోపం, చిరాకు, భయం లాంటి ఫీలింగ్స్ అన్నీ చుట్టుముట్టి వేధిస్తున్నాయి.

అతని కళ్లు ఆటోలో ఎక్కేవారి కోసం రోడ్డున పోతున్న జనాన్ని ఆత్రంగా పరికిస్తున్నాయి. ఎవరైనా ఆటో వంక చూస్తే చాలు ''ఆటో... సార్... ఆటో... మాడమ్'' అని ప్లీజింగ్‌గా అడగసాగాడు. అందరూ ముఖం తిప్పుకుపోయేవాళ్లే! ఎండకి కళ్లు తిరుగుతున్నాయి. పశ్చిమం వైపు జారుతున్న సూర్యుడిని చూస్తుంటే వెన్నులోంచి వణుకొస్తోంది నారాయణకు!

'అమ్మో! ఇంట్లో మందులు కూడా నిన్న రాత్రితో అయిపోయాయి. ఈవేళ డబ్బులు లేకపోతే, రాకపోతే... పిల్లాడు ఏమైపోతాడో... పోనీ ఓ సారి ఇంటికెళ్లి చూసొస్తేనో' అనుకున్నాడు. వెంటనే ఇంటికి బయల్దేరాడు.

ఆటో తనుంటున్న వీధి చివరికి రాంగానే మరింక ముందుకు పోలేకపోయాడు. ఖాళీ జేబుల్తో భార్య ముఖం చూడాలనిపించక వెనుదిరిగాడు.

'ఈవేళ వెళ్తే డబ్బుల్తోనే ఇంటికెళ్లాలి...' ఒక రకమైన కసితో తనకి తనే షరతు పెట్టుకున్నాడు నారాయణ.

అతని మెదడు కొడుకు గురించి ఆలోచిస్తుంటే కళ్లు ఆత్రంగా పాసింజర్ల కోసం వెతకసాగాయి. కన్నులు కాయలు కాచేలా సవారీ కట్టించుకునే వారి కోసం అతని వెతుకులాట కొనసాగుతూనే ఉంది. చూస్తుండగానే సూర్యుడు సంధ్యాదేవి కౌగిట్లో వాలిపోయి నారాయణ కన్నుల్లో చీకటిని నింపేశాడు. అతని హృదయం మూగగా ఆక్రోశించసాగింది. తన మీద తనకే జాలివేయసాగింది... 'బిడ్డ ఇక దక్కుతాడా?..' మెదడుని తొలిచేస్తున్న ప్రశ్న!

''ఆటో...'' ఆ పిలుపుకి నాదస్వరం విన్న పాములా తటాలున కదిలాడు నారాయణ.

ఆ గొంతు తాలూకు శాల్తీకి నలభై ఐదేళ్లుంటాయి. నల్లని భారీ శరీరం, బుంగమీసాలు, బానపొట్ట, ఎర్రటి కళ్లు... చేతిలో సిగరెట్టు... గుప్పుమంటున్న బ్రాందీ వాసన!

''ఎక్కడికెళ్లాలి సార్...?'' వినయంగా అడిగేడు నారాయణ.

''అక్కడికే...'' వంకరగా నవ్వి అన్నాడతను.

అర్థం కానట్టు చూసేడు నారాయణ.

''అదేనయ్యా...'' అంటూ అతను ఆ ఏరియా పేరు చెప్పేడు.

నారాయణ ముఖం నల్లబడింది. సాధారణంగా అలాంటి చోటుకు అతను సవారీ కట్టడు. అవటానికి పేదవాడే అయినా... చేసేది ఆటో డ్రైవింగే అయినా అతనికీ కొన్ని సిద్ధాంతాలు, నియమాలు ఉన్నాయి. కానీ ఇప్పుడతను క్లిష్ట పరిస్థితిలో ఉన్నాడు. కొడుకు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ట్రీట్‌మెంటుకు డబ్బులు అత్యవసరం!

''ఎక్కండి'' అన్నాడు నారాయణ ఆటో స్టార్ట్ చేస్తూ.

అతను ఆటోలో కూర్చున్నాక ఆటో ముందుకు కదిలింది.

''మంచి కేండిడేట్ దగ్గరకు తీసుకెళ్లు. నీ కమిషను నీకిచ్చేస్తాను'' అన్నాడతను.

''నాకలాంటి వాళ్లెవరూ తెలియదు''

''భలే వాడివయ్యా... సత్తెకాలపు వాడిలా ఉన్నావు. అలాంటివన్నీ తెలుసుకుని అందరు ఆటో డ్రైవర్లలా రెండు చేతులా సంపాయించాలి'' సలహా ఇచ్చాడతను.

ఆ మాటలకి నారాయణకి తేళ్లు, జెర్రెలు మీద ప్రాకినంత కంపరం కలిగింది. 'తార్పుడు పనా? ఛీ...' అనుకున్నాడు.

ఆటో ఆ ఏరియాకు చేరుకున్నాక... మీటరు చూసి నలభై రూపాయలు చేతిలో పెట్టి ''మంచి పిట్టని చూసి పెట్టుంటే ఇంకో వందో, రెండొందలో ఇద్దును...'' అన్నాడతను.

నారాయణ మాట్లాడలేదు.

డీజిల్ రిజర్వులోకి వచ్చేసింది. అక్కడికి దగ్గరలో ఉన్న బంకులో రెండు లీటర్లు డీజిల్ కొట్టించి రోడ్డు కార్నర్‌లో ఆటో ఆపి మరో బేరం కోసం ఎదురుచూడసాగాడు.

## రొమాంటిక్ నవనీత్

**గ్లామర్ డాల్ నవనీత్ కౌర్ బోల్డంత రొమాంటిక్ పోజులిస్తున్న సంగతి అందరూ చూస్తూనే వున్నారుగా. అయితే రాబోయే 'జాబిలమ్మ' అనే సినిమాలో గృహిణి పాత్రలో సంప్రదాయబద్ధమైన గెటప్‌లో కనిపించే నవనీత్ 'కాలచక్రం' అనే మరో సినిమాలో కావల్సినంత రొమాంటిక్‌గా నటిస్తోందని ఫిలింనగర్ కబురు. ఈ సినిమాలో నవనీత్ హాట్ హాట్ పోజులు షూటింగ్ సమయంలో యూనిట్‌వాళ్లనే తెగ 'ఇది' చేస్తున్నాయట. ఇలా అయినా పాపులర్ అయి కెరీర్‌లో బిజీ అవుతుందేమో!**



ఇంతలో ఒక ఇంటి గేటు తెరుచుకుని ఓ నడివయసావిడ, పదహారేళ్ల అమ్మాయితో బయటకు వచ్చి ''ఆటో'' అంటూ అరిచింది.

టక్కున ఆటో స్టార్ట్ చేసి వాళ్ల ముందుకు తీసుకెళ్లాడు నారాయణ. ఆమె ఎడ్రస్ చెప్పి అంది ''మీటరు పైన యాభై రూపాయలిస్తాను. జరంత త్వరగా తీస్కెళ్లు'' అని.

తలూపి ఆటో కదిల్చాడు నారాయణ.

ఆవిడది భారీ శరీరం. వయసు యాభైకి అటో ఇటో ఉంటుంది. నోట్లో పాన్ నలుగుతోంది. చేతుల్నిండా రాళ్లుమట్టిగాజులు.

ఆ పిల్ల సన్నగా, తెల్లగా బొమ్మలా ఉంది. ఇంకా పసితనం పోలేదు ఆ ముఖంలో! చెంపకు చారడేసి ఉన్న ఆ కళ్ల నిండా అమాయకత్వమే!

''ఎక్కడికి వెళుతున్నాం?'' ఆ అమ్మాయి అడిగింది ఒరియా ,

బాషలో.

''ఎక్కడికి వెళ్లినా జరిగేది అదే కదా'' వంకరగా నవ్వి అంది ఆవిడ ఆ అమ్మాయితో ఒరియాలోనే!

నారాయణ పదేళ్ల క్రితం బరంపురంలో బట్టల కొట్లో గుమస్తాగా పనిచేశాడు. అతనికి ఒరియా భాష వచ్చు. వాళ్ల సంభాషణ విన్న అతనికి మనసంతా చేదు తిన్నట్టయిపోయింది. అతనికిప్పుడు ఇంత అత్యవసరంగా డబ్బు ఆవశ్యకత లేకపోతే వాళ్లని వెంటనే దిగిపొమ్మనేవాడే. మూసిన కన్ను తెరవకుండా మంచానికంటుకుపోయిన కొడుకు గుర్తొచ్చి మనసు చంపుకుని ఆటో నడపసాగాడు నారాయణ.

''ఈ రోడ్డూ... ఇటెక్కడికి?'' మళ్లీ అడిగిందామ్మాయి.

నడివయసావిడ మాట్లాడలేదు.

''దాసు శేఠ్ ఇంటికేనా?'' ఆ పెద్ద పెద్ద కళ్లల్లో అంతులేని భయం.

''అవును.. ఏమిటి నోరు లేస్తుంది? మూసుక్కోర్రో!'' అంది కర్కుగ్గా.

''హమ్మో! ఆటో ఆపు. నేను అక్కడికి రాను'' ఏడవసాగిందా అమ్మాయి.

''ఆటో త్వరగా పోనీ... ఈ పిల్ల గొడవచేసేలా ఉంది. ఏ ఇబ్బంది రాకుండా నేను చెప్పిన ఎడ్రస్‌కు చేర్చు. నీకు నాలుగొందలిస్తాను'' ఆవిడ ఆశ పెట్టింది నారాయణకు.

నాలుగు వందలు!


నారాయణ మనసు దూదిపింజలా తేలికైయింది 'ఆ నాలుగొందలుంటే కిరణ్‌కు మంచి ట్రీట్‌మెంట్ ఇప్పించి రక్షించుకోవచ్చు' అనుకున్నాడు నారాయణ. ఆటో స్పీడు పెరిగింది.

ఆ అమ్మాయి ఏడుపు కూడా...

''దాసు శేఠ్ మనిషి కాదు రాక్షసుడు. నా వళ్లంతా బ్లేడ్‌తో గాట్లు పెట్టాడు. సిగరెట్‌తో కాల్చాడు! ఆ మృగంతో నరకం నేను అనుభవించలేను. నేను చచ్చిపోతాను... నన్ను పోనీయ్'' ఆ అమ్మాయి విపరీతంగా రోధిస్తూ స్పీడుగా వెళుతున్న ఆటోలో నుంచి దూకెయ్యబోయింది. ఆవిడ ఆ అమ్మాయిని లోపలికి లాగి చెంప చెళ్లుమనిపించింది.

''పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యకు! ఒళ్లంతా కోసినా శేరు మాసం రాని నీలాంటిదానికి ఒక్క రాత్రికి పదివేలు ఎవడిస్తాడే దాసు శేఠ్ తప్ప! ఇదయ్యాక ఓ వారం రోజులు రెస్ట్ తీసుకుందువుగాని'' చెప్పిందావిడ.

''పోయినసారి పంపినపుడు నెల రోజు




లకు కాని లేచి తిరగలేకపోయాను. ఇంకెక్కడికి రమ్మన్నా వస్తాను. దాసు శేఠ్ దగ్గరకు మాత్రం రాను. ప్లీజ్... అతను మనిషి కాదు మృగం... పిచ్చి క్రూర మృగం'' ఆమె చెంపల్నిండా అశ్రుధారలు.

''ఒరియా భాష నాకు రాకపోయినా బావుణ్ణనుకున్నాడు నారాయణ. ఆ బాలిక రోదన అతని హృదయాన్ని ద్రవింపజేస్తుంది.

'వెధవ డబ్బు...' డబ్బు మీద ఒక్క క్షణం అసహ్యం కలిగింది నారాయణకి. అంతలోనే... 'అమ్మో... ఆ డబ్బు లేకపోతే ఒక్కగానొక్క బిడ్డడు ఏమైపోతాడో...' అని భయం వేసి మళ్లీ డబ్బంటే ఆశ కలిగింది.

ఆ అమ్మాయి ముక్కుపచ్చలారనిది. వేశ్యావృత్తిలో బలవంతంగా దింపబోయింది. ఆ నడివయసావిడ డబ్బు కోసం చిదిమిన పాలుగారే పసిదాన్ని ఓ శాడిస్ట్ దగ్గరకు పంపుతోంది. ఇప్పుడే డబ్బు అవసరం లేకపోతే ఆవిడకు తగిన బుద్ధి చెప్పి ఉండేవాడు. కానీ ఆవిడ ఇవ్వబోయే పచ్చనోట్లు తన కొడుకుని ఆరోగ్యవంతుడ్ని చేస్తాయి అన్న నమ్మకంతో ఆటోను ఆవిడ చెప్పిన గమ్యం వైపు నడిపిస్తున్నాయి.

సైడ్ మిర్రర్‌లోంచి ఆ అమ్మాయి ముఖం నారాయణకు స్పష్టంగా అగుపిస్తోంది. ఆ ఆల్చిప్పల్లాంటి కళ్లల్లో అంతులేని భయం! ఆమె ముఖంలోని ఫీలింగ్స్ చూస్తేనే అర్థం అయింది నారాయణకు ఆ దాస్ శేఠ్ అనే వాడెవడో ఎంత శాడిస్టో!

''ఆటో అన్నా... ప్లీజ్ నన్ను అక్కడికి తీసుకెళ్లకు. నీకు దణ్ణం పెడతా. నాలాంటి కూతురు నీకు లేదా? ఉంటే ఆమెనైతే ఇలా ఓ దుర్మార్గుడి దగ్గరకు పంపుతావా?'' హృదయవిదారకంగా రోదించసాగిందా పిల్ల, పులిని తలుచుకుని హడలిపోతున్న లేడి కూనలా.

''ఏయ్.. నోరుముయ్.. ఒరియా భాష ఇక్కడెవరికీ అర్థం కాదు. అతను నా మనిషి. నాలుగు వందలిస్తానని చెప్పి అతన్ని కొన్నాను. నోర్ముయ్'' కత్తిలా పదునుగా ఉంది ఆవిడ

## సిమ్రాన్ రికార్డు!

**కమల్ హాసన్ పది వేషాలు వేసి 'దశావతారం' సినిమాతో రికార్డు సృష్టిస్తే సిమ్రాన్ మరో రెండు వేషాలు ఎక్కువేసి రికార్డు బద్దలు కొట్టే ప్రయత్నం చేస్తోందిట. కాకపోతే ఈ ప్రయోగం సినిమాలో కాదులెండి. ఓ తమిళ టీవీ సీరియల్‌లో సిమ్రాన్ ఏకంగా పన్నెండు పాత్రలు వేస్తోందిట. తమిళ సీరియళ్లు ఎలాగూ తెలుగులోకి అనువాదం అవుతుంటాయి కాబట్టి సిమ్రాన్ పన్నెండు వేషాలనీ మనమూ చూడవచ్చు.**



గొంతు.

''అన్నా... అన్నా... ప్లీజ్...'' చిన్నగా గొణుక్కోసాగిందా అమ్మాయి.

ఆమె ''అన్నా...అన్నా..'' అంటుంటే నారాయణకి ''నాన్నా...నాన్నా..'' అంటున్నట్టు వినిపించసాగింది. అతనిలో అప్పటివరకు డబ్బు కోసం నిద్ర నటిస్తున్న 'మనిషి' ఉలిక్కిపడి లేచాడు. 'కిరణ్‌కి ముందు తనకో కూతురుండి ఉంటే అది ఈ అమ్మాయి తోటిదే అయి ఉండేది...' అనిపించింది నారాయణకి. అంతలోనే కిరణ్ పరిస్థితి గుర్తొచ్చింది.

''ఇటు వైపెక్కడికి?'' ఆవిడ అడిగింది నారాయణని.

''మీరు చెప్పిన చోటుకు ఇదే దగ్గర దారి'' అన్నాడు నారాయణ.

వెనుక సీట్లో ఏడుస్తూ రక్షించమని అర్థిస్తున్న ఆ అమ్మాయి... ఇంట్లో వంటి మీద తెలివి లేకుండా జ్వరంతో పడి ఉన్న కొడుకు.. ఈ రెండు దృశ్యాలు నారాయణ స్మృతిపథంలో ఒక ఫ్రేం తర్వాత మరో ఫ్రేంలా వచ్చిపోతున్నాయి.

సడెన్‌గా ఆటో ఓ పెద్ద కాంపౌండ్ వాల్ దాటి ఓ బిల్డింగ్ ముందు ఆగింది.

''ఇదేమిటి? ఎక్కడకి తీసుకొచ్చావు?'' కంగారుగా అడిగిందావిడ.


''ఇదే నీలాంటి వాళ్లు చేరాల్సిన గమ్యస్థానం'' కూల్‌గా అన్నాడు నారాయణ.

ఆవిడ కంగారుగా తలెత్తి ఆ భవనం వైపు చూసింది.

''ఉమెన్ ప్రొటెక్షన్ సెల్'' అన్న తళతళ మెరుస్తున్న బంగారు అక్షరాలు ఆమె కళ్లబడ్డాయి. ఇప్పుడు ఆ నడివయసావిడ వణికిపోసాగింది భయంతో.

ఇంతలో పోలీసులు వచ్చారు. నారాయణ అక్కడి లేడీ ఇన్‌స్పెక్టరుతో జరిగినదంతా వివరించి వాళ్లడిగినట్లు కంప్లయింట్ రాసి ఇచ్చేడు.

ఆ మహిళా పోలీసు అధికారిణి వెంటనే ఆ అమ్మాయిని ప్రభుత్వ బాలికల సంక్షేమ కేంద్రానికి తరలించేలా ఏర్పాట్లు చేశారు. ఆ నడివయసావిడ నారాయణకు శాపనార్థాలు పెట్టసాగింది.




నారాయణ వచ్చేస్తోంటే ఆ అమ్మాయి కృతజ్ఞతాపూర్వకంగా రెండు చేతులు జోడించింది. ఆ అమ్మాయి ముఖంలోని సంతోషం చూసి నారాయణ మనసంతా తృప్తితో నిండిపోయింది.

భుజం మీద ఖాకి చొక్కా సర్దుకుంటూ హుషారుగా ఆటోలో కూర్చున్నాడు నారాయణ! ఆటో స్టార్ట్ చేసి కొంచెం ముందుకొచ్చేక గమనించాడు... డీజిల్ మళ్లీ రిజర్వుకొచ్చేసింది. సమయం రాత్రి పదకొండవ్వొస్తోంది. జేబులో చిల్లర మాత్రమే ఉంది. అప్పటి వరకు ఆ అమ్మాయిని రక్షించేనన్న ఉత్సాహం స్థానంలో దిగులు, బెంగా, భయం గబగబా వచ్చేసి చేరాయి.

'ఎలా ఉన్నాడో చిట్టి తండ్రి. అసమర్థుడైన తండ్రి కడుపున పుట్టిన పాపానికి జ్వరంతో కునారిల్లుతున్నాడు. అసలీపాటికే ఏదైనా...' ఆ ఊహకే వెన్నులోంచి వణుకు ప్రారంభమైంది నారాయణకి.

కంపిస్తున్న శరీరాన్ని అదుపులో ఉంచుకుని... ఆటోని ఇంటిదారి పట్టించాడు నారాయణ. భయం భయంగా ఇంట్లో అడుగు పెట్టాడు.

''నాన్న...'' అంటూ కిరణ్ వచ్చి నారాయణ కాళ్లకు చుట్టేశాడు. ఒక్క క్షణం తను చూస్తున్నది కలో నిజమో అర్థం కాలేద తనికి.

''నాకు జ్వరం తగ్గిపోయింది. అది చెపుదామనే నీ కోసం ఎదురుచూస్తున్నాను'' ఆశ్చర్యంగా చూస్తున్న తండ్రితో అన్నాడు కిరణ్.

చప్పున వాణ్ని గుండెలకు హత్తుకున్నాడు నారాయణ. కిరణ్ ఒళ్లు చల్లగా తగులుతూ అతనికి అంతులేని హాయినిస్తోంది.

''ఉదయం జ్వరం తగ్గింది. చారు అన్నం పెట్టేను. ఇంత ఆలస్యమైందే?'' అడిగింది లక్ష్మి.

నారాయణ కళ్ల ముందు సంతోషంతో చేతులు జోడించిన ఆ అమ్మాయి ముఖం కదలాడింది.

''ఎందుకు ఆలస్యమైందంటే...'' నారాయణ భార్యకు చెప్పడం మొదలుపెట్టేడు. ☆

## కోల్డ్‌వార్ కథేంటో?

**కత్రినా కైఫ్-మలైకా అరోరాల మధ్య 'కోల్డ్ వార్' నడుస్తోందని బాలీవుడ్ కోడై కూస్తోంది చాన్నాళ్లుగా. ఇటీవల కత్రినా బర్త్‌డే సందర్భంగా పార్టీలో సల్మాన్-షారుఖ్‌ల గొడవ రచ్చకెక్కిన నేపథ్యంలో కాబోయే తోడికోడళ్ల (కత్రినా-మలైకా) మధ్య గొడవలు కూడా వీధికెక్కాయి. ఆ పార్టీలో మలైకా ఎక్కడా కనిపించకపోవడమే కాకుండా షూటింగ్‌లో బిజీగా వున్నానని, అసలు తనకా పార్టీ సంగతే తెలీదని మలైకా అనడంతో కలహాలు రచ్చకెక్కినట్టయింది. ఈ గొడవలెందుకో మరి!**

